కెసిఆర్ నిర్ణయాలే తెలంగాణకు మరణశాసనం

- నీటిహక్కుల కోసమే పోరాటం
- బనకచర్లకు ఇంకా బ్రేకులు పడలేదు
- మళ్లీ తెరమీదకొస్తుంది : సిఎం రేవంత్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలే తెలంగాణకు మరణ శాసనాలు అయ్యాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నీళ్లే మన ప్రధాన ఎజెండా అని, ఇప్పుడు కూడా మన నీటి హక్కులను కాపాడాలనే మా పోరాటమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి సిఎంతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, గడ్డం వివేక్, పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు అరికె వేణుగోపాల్‌రావు, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ పాల్గొన్నారు.

299 టిఎంసిలకు కెసిఆర్ ఒప్పుకున్నారు: సిఎం రేవంత్

పిపిటి అనంతరం సిఎం రేవంత్ మాట్లాడుతూ కృష్ణా జలాల్లో ఉమ్మడి ఎపికి 811 టిఎంసిల్లో కెసిఆర్ 512 టిఎంసిలను ఎపికి ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణకు ఇచ్చిన కేవలం 299 టిఎంసిల నీటిలో కూడా 220 టిఎంసిలకు మించి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ వినియోగించుకోలేదన్నారు. ఈ పాపానికి ఆనాటి కెసిఆర్ తెలంగాణకు మరణశాసనం రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉందన్నారు. 68 శాతం ఉన్న తెలంగాణకు 299 టిఎంసిలే ఎలా వస్తాయని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్, హరీష్ రావు తొమ్మిదిన్నరేళ్ల పాటు నీటిపారుదల శాఖను చూశారని గుర్తు చేశారు. డబ్బులకు కక్కుర్తిపడి ప్రజల విశ్వాసాన్ని కెసిఆర్, హరీష్‌రావు వమ్ముచేశారని విమర్శించారు. నీళ్ల విషయంలో బిఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాలు, తెలంగాణ ప్రజలకు గుదిబండగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో నీటి ఏటాయింపులపై బిఆర్ఎస్ ఏనాడూ ప్రశ్నించలేదన్నారు గోదావరిలో నీటి లభ్యత 1480 టిఎంసిలను గుర్తించారని తెలిపారు. గోదావరిపై పెండింగ్ ప్రాజెక్టులేవీ కెసిఆర్ పూర్తిచేయలేదని, అందులో ప్రధానమైనది ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అని అన్నారు. ధనదాహం కోసమే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోస్తే, వరదలొచ్చి మళ్లీ నీటిని కిందకు వదిలేవారన్నారు.

రూ.ఏడు వేల కోట్ల కరెంటు బిల్లులు : సిఎం

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. ఏడు వేల కోట్ల కరెంటు బిల్లులు వచ్చాయని సిఎం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ పునరుజ్జీవనం కోసం పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని, అందుకే నీళ్ల సెంటిమెంట్‌ను మళ్లీ వాడుకుంటున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పునరుజ్జీవనం కోసం ఎపి సిఎంను, తెలంగాణ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ బద్నాం చేస్తున్నదని నిరసన తెలిపారు. గోదావరి నీటిని రాయలసీమకు తరలించేందుకు కెసిఆర్ కుట్ర చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే రోజా ఇంటికెళ్లి రాగి సంకటి, చేపల పులుసు తిని రాయలసీమ రత్నాల సీమ చేస్తానని కెసిఆర్ అన్నారని గుర్తు చేశారు. మాకు సంకటి, చేపలు పులుసు వద్దనీ, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అనుమతుల తిరస్కరణ తాత్కాలికమేననీ, పున:పరిశీలన తర్వాతైనా మళ్లీ తెరమీదకు వస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కార్ మనుగడ చంద్రబాబు మీద ఆధారపడి ఉందని, చంద్రబాబు మనుగడ గోదావరి జలాల మీద ఆధారపడి ఉందన్నారు.

'11 ఏళ్లుగా తెలంగాణకు బిజెపి అన్యాయం'

11 ఏళ్లుగా తెలంగాణను కేంద్రంలోని బిజెపి నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బిజెపిపై పోరాటం ఉధృతం చేయాలని సిఎం రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణ తెచ్చిన బిఆర్ఎస్‌ను బలహీనపరిచేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర హక్కులను కాలరాసేందుకే బిజెపికి 8 ఎంపి సీట్లు ఇచ్చారా ? అని ప్రశ్నించారు. ఎపి నుంచి కేంద్రంలో ఉన్న మంత్రులు, వాళ్ల రాష్ట్రం కోసం ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారని, తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు మాత్రం రాష్ట్రం కోసం ఏమీ చేయడం లేదన్నారు. నీటి కేటాయింపుల గురించి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి కిషన్‌రెడ్డి ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీశారు. కెసిఆర్ కోసమే కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన మాటల్లో ప్రతిమాట కెసిఆర్ దగ్గర నుంచే వస్తున్నదని ఆరోపించారు. నీటి పంపకాల గురించి చర్చించేందుకు మేము వస్తున్నామంటే ఆయన ముందు వెళ్లి కేంద్ర మంత్రిని కలుస్తున్నారని, కిషన్‌రెడ్డి తీరు అనుమానాలకు తావు ఇస్తున్నదన్నారు. కేంద్ర మంత్రులను కలిసేందుకు కిషన్‌రెడ్డి మాతో కలిసి ఎందుకు రావడం లేదని, మాకంటే ముందే వెళ్లి రహస్యంగా వెళ్లి చర్చించాల్సిన అవసరమేంటి అని ప్రశ్నించారు.

మొదటి పంటకే నీళ్లు లేవు: సిఎం

గోదావరి వరద జలాలను తరలిస్తే తెలంగాణకు ఇబ్బందేంటని ఎపి వాదిస్తున్నదని, మరి నికర జలాల్లో మా వాటాపై ఎపి ఎందుకు అభ్యంతరం చెబుతున్నదని సిఎం అడిగారు. మూడో పంట కోసమే ఎపి ప్రయత్నిస్తున్నదని, ఇక్కడ మాకు మొదటి పంటకే నీళ్లు లేవన్నారు. మా నీటి వాటాలపై ఎపి కూడా సహకరించాలని కోరారు. కెసిఆర్ హయాంలో జరిగిన చర్చల మేరకే చంద్రబాబు ప్రాజెక్టు కడుతున్నారని గుర్తు చేశారు. నికర జలాల్లో 968 టిఎంసిలు, ప్రాజెక్టులకు అనుమతుల కోసమే మా ప్రయత్నమని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నికర జలాలు, మిగులు, వరద జలాల లెక్కలు తేల్చాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. అన్నీ లెక్కలు తేలాకే వరద జలాల గురించి మాట్లాడాలని స్పష్టం చేశారు.

బనకచర్ల అనుమతుల తిరస్కరణ
తెలంగాణ సర్కార్ విజయం:ఉత్తమ్

ఎపి ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై ప్రజాభవన్‌లో పీపీటీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అందుకే బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు గురించి ఎపి సిఎం చంద్రబాబు చేసిన వాదనలు పూర్తిగా అవాస్తవమని అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే ఈ మోసానికి పునాది పడిందన్నారు. 2016లో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇద్దరు ముఖ్యమంత్రులు పాల్గొన్నారని చెప్పారు. 2018 మార్చి, జూన్, సెప్టెంబర్‌లలో ఈ ప్రాజెక్టుకు అనుకూలంగా జలాలు ఇచ్చినా నాటి ముఖ్యమంత్రి నోరు మెదపలేదన్నారు. జీఓ 98 పేరుతో నిధులు మంజూరు చేసినా అడ్డుచెప్పలేదని విమర్శించారు. గోదావరి జలాలను కృష్ణా, పెన్నా నదికి మళ్లించేందుకు ఎపి సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు జరిపింది కెసిఆర్ అని చెప్పారు. అధికారులతో హైలెవల్ కమిటీ సైతం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అప్పుడు అన్నీ ఒప్పందాలు చేసుకున్న బిఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన లబ్దిదారులు

'డబుల్' ఇళ్లు అప్పగించాల్సిందే

- సిపిఎం ఆధ్వర్యంలో లబ్దిదారుల భారీ ర్యాలీ
- తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ హోతి (బి)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 20 రోజుల్లో అప్పగిస్తామన్న హామీని అధికారులు నిలబెట్టుకోకపోవడంతో లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు ఇళ్ల తాళాలు అప్పగించి ఇండ్లను స్వాధీనం చేసేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ బైఠాయించారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌తో సిపిఎం నాయకులు ఫోన్‌లో మాట్లాడారు. 7వ తేదీలోగా ఇళ్ల తాళాలు అప్పచెబుతామని, అప్పటివరకు వేచి ఉండాలని అధికారులు తెలిపారు. దాంతో లబ్దిదారులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. పేదలకు వచ్చిన ఇండ్లను ఇవ్వకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే లబ్దిదారులకు ఇండ్ల తాళాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేక పేదలు పెద్ద ఎత్తున ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సారి కూడా అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ఏడవ తేదీ లోపు ఇళ్ల తాళాలు ఇవ్వకుంటే లబ్దిదారులే వెళ్లి ఇండ్లలో ఉంటారని స్పష్టంచేశారు. ఆ పరిస్థితి వరకు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుపతి, సలీం, బక్కన్న, డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు శ్రీనివాస్, శివకుమార్, యాదుల్, స్వప్న పాల్గొన్నారు.

బెజగామలో అపూర్వ సతి శిల గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజగామలో సతి శిల, శూలారోహణ ఆత్మాహుతి శిలతో పాటు ఇతర వీరగల్లులను గుర్తించినట్టు నంగునూరుకు చెందిన ఔత్సాహిక చరిత్ర పరిశోధకులు, తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఈ సతి శిల ఇంతకు ముందు ఎన్నడూ కనిపించని అరుదైన వీర స్మారక శిల అని అన్నారు. వీరుని తలమీద పెద్ద సిగ, చెవులకు జుంకాలు, మెడలో కంటె, జంధ్యం, హస్త భూషణాలు, నడుముకు దట్టి, వీరకాసె, చేతుల్లో ఈటెతో, డాకాలు సాచి యుద్ధానికి సిద్ధమైనట్టుగా ఈ శిల్పం చెక్కి ఉన్నట్టు గుర్తించారు. వీరునికి కుడి పక్కన పెద్ద దమ్మిల్లంతో చెవులకు జూకాలు, మెడలో హారం, నడుమున నీవీబంధం, చేతుల్లో ఈటెతో శత్రువును చంపుతున్న వీరనారి నిలబడి ఉందని తెలిపారు. వీరునికి ఎడమవైపున పెద్ద దమ్మిల్లంతో, జూకాలతో, మెడలో హారంతో, నడుమున మేఖల కుడిచేతిలో పువ్వు, ఎడమచేత కమండలం పట్టుకొని కనిపిస్తున్న స్త్రీ ఆ వీరుని సతి అని అన్నారు. వీరుని కుడి పక్కన ఈటెతో శత్రువుని చంపుతున్న ఆ నారీమణి కూడా వీరుని వీరపత్ని అని తెలిపారు. బహుశా ఈ వీరునికి ఇద్దరు భార్యలు ఉండొచ్చని చెప్పారు. అక్కడ జరిగిన పోరులో భర్తతో పాటు పోరాడిన భార్య చనిపోగా, మిగిలిన భార్య భర్తతో పాటు సతీసహగమనం చేసిందని తెలిపారు. ఇలాంటి వీర స్మారక శిల ఇంతకు ముందు ఎన్నడూ లభించలేదని, ఈ సతి శిల కల్యాణి చాళుక్యుల కాలానికి చెందిందని చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజు హరగోపాల్ అన్నారు. ఈ శిలల పరిశీలనలో కొలిపాక శ్రీనివాస్ వెంట గ్రామస్తులు నర్ర కళాధర్, నాంపల్లి స్వామి, శ్యాం కుమార్ తదితరులు ఉన్నారు.


నవీన్ నికోలస్‌కు పూష్పగుచ్ఛం అందజేస్తున్న ఎల్‌సిజిటిఎ నాయకులు

ప్రభుత్వ టీచర్లకే ఉద్యోగోన్నతులివ్వాలి

- విద్యాశాఖ సంచాలకులకు ఎల్‌సిజిటిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు వేర్వేరంటూ సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో పలు తీర్పులను ఇచ్చాయని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్‌సిజిటిఎ) తెలిపింది. లోకల్ క్యాడర్‌గా గుర్తించబడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయులకు అన్ని క్యాడర్లకు సంబంధించిన ఉదోగోన్నతులను కల్పించాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇ నవీన్ నికోలస్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి మేకల లక్ష్మీకాంతరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ఏ జిల్లాలో పనిచేస్తుంటే ఆ జిల్లా జెడ్పీ సీఈవో పరిధిలోకి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా పరిషత్ హెచ్‌ఎంలకు ఎంఇఒలుగా అదనపు బాధ్యతలు అప్పగించడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఎంఇఒలుగా బాధ్యతలను అప్పగించాలని సూచించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 33 జిల్లాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు–1975 ప్రకారం పాత పది జిల్లాలు, రెండు జోన్లను కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ బడులను హేతుబద్ధీకరణ చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేయాలని కోరారు.

వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరంలాగే ఆషాఢ మాసం తొలి మంగళవారం కల్యాణ వేడుకను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దసంఖ్యలో జనం తరలిరాగా.. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలకు దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ఆలయ చైర్మన్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు ఘనంగా చేశారు. తాగునీరు, విద్యుత్ నిరంతరంగా అందుబాటులో ఉంచగా.. సందర్శకులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ అమ్మవారి కల్యాణం తిలకించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణ మహోత్సవంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, సమాచార శాఖ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, హైదరాబాద్ సిపి సివి ఆనంద్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అడిషనల్ సిపి విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- ఉగ్రదాడుల సమయంలోనే కార్మిక కోడ్స్‌ను అమల్లోకి తెచ్చిన కేంద్రం : పాలడుగు భాస్కర్
- చర్లపల్లి పారిశ్రామికవాడలో సమ్మె సన్నాహక సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల తొమ్మిదిన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని సూరాన చౌరస్తా వద్ద మంగళవారం చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలుడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, కార్మిక వర్గాన్ని దోచుకునే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడుల నేపథ్యంలో ఈ నెల తొమ్మిదికి వాయిదా వేశామని తెలిపారు. కానీ కేంద్రం అదే సమయంలో అత్యంత దుర్మార్గంగా లేబర్ కోడ్స్‌ను అమలులోకి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటలకు పెంచడం, మహిళలకు రాత్రి పూట డ్యూటీలు వేయడం, ఈజీ ఆఫ్ డూయింగ్ పేరుతో కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు దేశాన్ని అప్పగించాలన్నదే మోడీ ప్రభుత్వ లక్ష్యమని విమర్శించారు. మేడ్చల్ జిలా ప్రధాన కార్యదర్శి జె చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నాలుగు కోడ్స్‌గా మార్చడం ద్వారా పర్మినెంట్ ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుందన్నారు.

చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమ్మె విజయవంతం కావడం ప్రతి కార్మికుని బాధ్యత అని తెలిపారు. ఈ సమావేశానికి చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బివి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. టీయూసీఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ శ్రీనివాస్, ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.మణికంఠ, టికెఐఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, కె.బాలరాజ్, గండూరి ఫుడ్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, టి రవీందర్‌రెడ్డి, ఎన్నార్ టెక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ పాషా, శివప్రా క్రేన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, ఆశీష్ క్రేన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్, హైక్యూబ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, 3డి ఫోమ్ కట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి ఆదాం, ఐడిఎ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె నరసమ్మ పాల్గొన్నారు.

ఇనాక్ సాహిత్య సృష్టి సమస్తం సామాజిక దృష్టి

ప్రజాశక్తి కల్చరల్



ఇనాక్ సాహిత్య సృష్టి సమస్తం సామాజిక దృష్టి తోనే అని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం ఆరంభ వేడుకకు ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సృష్టి దృష్టి గ్రంథం ను ఆవిష్కరించి మాట్లాడారు ఇనాక్ వివిధ ప్రక్రియలలో చేసిన రచనలు అన్నిటిలో దళిత బహుజన వాదం ధ్వనిస్తుంది అని అన్నారు మధు జ్యోతి తన తండ్రి సాహిత్యం పై సమగ్ర అవగాహన తో పాఠకులుకు అర్థం అయ్యే రీతిలో అందించారు అని అభినందించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇనాక్ పలు గ్రంథ రచయిత అని అయన రచనలు అన్ని సామాజిక చింతన కలిగి ఉంటాయి అన్నారు అయన జన్మ దినోత్సవం ప్రతి ఏటా వారం రోజులు గాన సభ నిర్వాహణలో చేయడం సాహితీ మూర్తికి ఇచే గౌరవమని చెప్పారు ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్ మాటాడుతూ ఇనాక్ సాహిత్యం పై మధు జ్యోతి రచన సాహిత్య పరిశోధకులకు కర దీపిక అన్నారు వేదిక పై సంగీత గురువు మల్లాది ఉష, గుండవరపు గీతా దేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

- మొదటిరోజు 10,602 మంది హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా మంగళవారం ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతనెల 28వ తేదీ నుంచి ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల ఏడో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి ఈనెల ఎనిమిదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. మొదటిరోజు 10,602 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. ఈనెల ఆరు నుంచి పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 76,643 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 13న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 14,15 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒకవేళ మార్పులు చేయకుంటే వాటినే మొదటివిడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజల కోసమే జీవించే నాయకత్వం అరుదు

- మద్ది కాయల ఓంకార్ జీవితం ఆదర్శం : జస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల కోసం తమ జీవితాలను అర్పించే నాయకత్వం అరుదు.. నేటి తరానికి మద్ది కాయల ఓంకార్ జీవితం ఆదర్శం అని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో మంగళవారం ఎంసిపిఐ (యు) జనరల్ బాడీ సమావేశం వస్కుల సైదక్క అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడిగా, ఎమ్మెల్యేగా, కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతవాదిగా ఓంకార్ అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. ఆదివాసీలకు స్వయం పాలన అధికారం కావాలని, భద్రాచలం రాజధానిగా గోదావరి లోయ పరివాహక అటవీ ప్రాంతం ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు పాలనాధికారం కల్పించాలని, 1986–1987లో నెలల తరబడి పోరాటాలు చేసి ఆదివాసీ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన తీరు చారిత్రాత్మకం అన్నారు. కేంద్రంతోపాటు 20కి పైగా రాష్ట్రాల్లో బీజేపీ, దాని మద్దతుదారులు అధికారం అనుభవిస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు ఐక్యతతో అధికారంలోకి రావడమే ఓంకార్‌కు నిజమైన నివాళి అన్నారు. ఎంసిపిఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా.. ప్రపంచ శాంతి కోసం ప్రజాఉద్యమాల నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. ఓంకార్ శతజయంతి సభలు 2025 మే 12 నుంచి ప్రారంభమై 2026 మే 12 వరకు జరుగుతాయన్నారు. అనంతరం ఇటీవల మరణించిన ప్రపంచ ఖ్యాతిగాంచిన గుగువా థియాంగోకు, మహిళా నేత శాఖమూరి సుగుణమ్మకు, కేరళ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.యన్ నారాయణన్, కుక్కల యాకయ్యకు, విమాన ప్రమాద మృతులకు నివాళులర్పించారు.

ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ నిర్వహణ కమిటీ

గౌరవాధ్యక్షులుగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, అధ్యక్షులుగా ఎంసిపిఐ (యు) పొలిట్‌బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, కోశాధికారిగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా గాదగోని రవి, వస్కుల మట్టయ్య, కుంభం సుకన్య, హెన్‌రెడ్డి హంసారెడ్డి, సహాయ కార్యదర్శులుగా వరికుప్పల వెంకన్న, పెద్దారపు రమేష్, మంద రవి, ఎస్‌కె నజీర్, వి తుకారాం నాయక్, మరికొంత మంది సభ్యులను నియమించారు.

4న బిఇడి అభ్యర్థుల సచివాలయ ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బిఇడి అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల నాలుగు తేదీన సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సలవాది పాండు, ప్రధాన కార్యదర్శి లావుడ్యా అశోక్, ఉపాధ్యక్షులు కె కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10 నుంచి 14 వరకు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టి వరకు మహా పాదయాత్రను చేపడతామని తెలిపారు. 25 ఏండ్లుగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఎ) పోస్టులను బిఇడి అభ్యర్థులకు 30 శాతం మాత్రమే ఇవ్వడం వల్ల తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని తెలిపారు. బిఇడి పూర్తి అభ్యర్థులు నిరుద్యోగులుగా మారుతున్నారని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నేరుగా 80 శాతం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జిటిల నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోటాను 20 శాతానికి తగ్గించాలని కోరారు. బిఇడి అభ్యర్థులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో 8,27,230 దరఖాస్తులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ బ్యూరో : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హత పొందిన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. వారు సమర్పించిన అన్ని డాక్యుమెంట్లను భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుదారులకు సరైన కారణాలను తెలపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించామనీ, అందులో 8,27,230 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తులను డేటా ఫార్మేట్‌లో భూభారతి పోర్టల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని ఒకటి రెండు రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు.



వ్యక్తి ఉన్నతికి నిబద్ధత అవసరం

ప్రజాశక్తి కల్చరల్

ఏ వ్యక్తి ఇనా ఉన్నత స్థాయి కి ఎదగటానికి నిబద్ధత తో పాటు పరిస్థితులు అనుకూలించాలి అని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు ప్రభుత్వ ఉద్యోగిగా భాధ్యత నిర్వర్తిస్తూ తనకు నటన పై సాంస్కతిక రంగం పై ఉన్న మక్కువతో ఉన్నతంగా ఎదిగిన వారు సమైక్య భారతి సత్యం గా గుర్తింపు పొందిన గంజి సత్యనారాయణ అని ప్రశంసించారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో గంజి సత్యనారాయణ డెబ్బై ఐదేళ్ల వజ్రోత్సవ వేడుక జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ లాంఛనం గా సత్యనారాయణ దంపతులను సత్కరించి మాట్లాడారు. సౌశీల్యం కళా ప్రియత్వం కల సత్యనారాయణ నటుడుగా పలు సినిమాల్లో నటించడమే కాక జలతరంగిణి సమైక్య భారతి తదుపరి సత్కాలాభారతి సంస్థల ను స్థాపించి ఎందరో కళా కారులను,సాహితీ కారులను ప్రోత్సహించిన చరిత్ర ఆయనది అని కొని యాడారు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికష్ణ మాట్లాడుతూ కళాకారులు సాహితీ వేత్త లకు సహకరించాలి అన్న తపనతో సత్యనారాయణ నిరంతరం కృషి చేశారని అభినందించారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ సత్యనారాయణ దూరదర్శన్ తొలి తరం నటుడు అని ఆయన దర్శకత్వం వహించిన నటించిన సీరియల్స్‌కు ప్రభుత్వ నంది అవార్డులు ఎన్నో అందుకున్నారని గుర్తు చేశారు. సత్కాలాభారతి పురస్కారంకు ఎంపిక చేసిన జిఎస్ఎన్ శాస్త్రి నాటక రంగ భీష్ముడు అన్నారు. అధ్యక్షత వహించిన అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల రావు మాట్లాడుతూ ఒక సాంస్కృతిక సంస్థ మరో సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడి జన్మ దినోత్సవం జరపటం మంచి సంస్కారం అని కిన్నెర రఘురాంను అభినందించారు. వేదికపై తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాల కృష్ణ తదితరులు పాల్గొనగా కిన్నర రఘురాం స్వాగతం పలికారు. అనంతరం గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే జ్యోతి రాజ్ రచించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం ప్రదర్శించారు.

కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే యత్నం

- ఐక్య పోరాటాలతో మోడీ విధానాలను తిప్పికొట్టాలి
- లేబర్ కోడ్‌ల రద్దు కోసం జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి
- సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పిలుపు



సంయుక్త సమావేశంలో నినదిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌లతో కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే మోడీ సర్కారు యత్నాలను తిప్పికొట్టాలని, జులై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో మూడు సంఘాల ఆధ్వర్యంలో సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడం కోసం మోడీ సర్కారు పెద్ద పీట వేస్తున్న తీరును విడమర్చి చెప్పారు. కార్మికవర్గంపైనా, రైతులపైనా, గ్రామీణ వ్యవసాయ కార్మికులపైనా భారాలు మోపుతున్న తీరును వివరించారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటల పనిదినంగా మార్చాలని చూస్తోందని, వేతనాలు నిర్ణయించే పద్ధతిని ద్వైపాక్షిక చర్చల ద్వారా కాకుండా ఏకపక్షంగా నిర్ణయించే పద్ధతిని తీసుకురాబోతున్నదని విమర్శించారు. పరిశ్రమలో 51 శాతం ఓట్లు వస్తేనే యూనియన్లకు గుర్తింపునిస్తామని, లేనిపక్షంలో అడ్వయిజరీ బోర్డులు వేయిస్తామని కోడ్‌లలో పేర్కొనడం దుర్మార్గమన్నారు. పిఎఫ్, ఈఎస్‌ఐ చట్టాల్లో అనేక మార్పులు చేసి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడేలా చేస్తున్న తీరును ఎండగట్టారు. మహిళలను ప్రమాదకరమైన పనుల్లో, రాత్రి వేళల్లో పనులు చేయించవద్దని గత చట్టాల్లో ఉన్నప్పటికీ నేడు వాటిని రద్దు చేసి గనుల్లో సైతం పని చేయాలనే పద్ధతిని తీసుకురావడాన్ని తప్పుబట్టారు. సార్వత్రిక సమ్మెకు దేశంలోని 500 పైగా రైతు సంఘాల జెఏసి (సంయుక్త కిసాన్ మోర్చా) మద్దతు ప్రకటించిందన్నారు. రైతాంగ పోరాటంతో మోడీ సర్కారు మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినప్పటికీ నేడు జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదా పత్రం ద్వారా రద్దైన చట్టాల్లోని అంశాలనే ముందుకు తెస్తూ రైతాంగంపై దాడి చేస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టే నిర్ణయాలను వేగంగా తీసుకుంటున్నదని చెప్పారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని అనేకసార్లు విజ్ఞప్తులు కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని వాపోయారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు వివిధ ట్యాక్స్‌ల పేరుతో రద్దు చేస్తున్న ప్రభుత్వం రైతాంగానికి మాత్రం రుణమాఫీ చేయడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన సోషలిజం, లౌకికవాదం అనే అంశాలు ఉండకూడదని రాజ్యాంగంపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలతో వ్యవసాయరంగంలో సంక్షోభం నెలకొని గ్రామీణ వ్యవసాయ కార్మికులు పని దినాలు కోల్పోతున్నారని వాపోయారు. ఉపాధి లేక, ఆహారం దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మెలలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులందరూ భాగస్వాములు కావాలని కోరారు. తొమ్మిదిన పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో కార్మికులే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ రైతులు, కూలీలు నిరసనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్‌వి రమ, విఎస్ రావు, కోశాధికారి వంగూరు రాములు, రైతు సంఘం సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్యాన్ని ప్రపంచం ప్రతిఘటిస్తోంది

- టారిఫ్ వార్, ఇరాన్ యుద్ధంలో అమెరికా ఫెయిల్
- భవిష్యత్ కమ్యూనిస్టులదే
- కొరటాల వర్ధంతి సభలో మాజీ ఎంపి పి మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అమెరికా ఆధిపత్యాన్ని ప్రపంచం ప్రతిఘటిస్తోందని సిపిఎం మాజీ ఎంపి పి మధు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో నవతెలంగాణ దినపత్రిక ఆధ్వర్యంలో జరిగిన కొరటాల సత్యనారాయణ 19వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు అమెరికా ఇష్టారీతిన సుంకాలను పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. చైనా, కెనడా, ఫ్రాన్స్ తదితర దేశాలు ఎదురు దాడికి దిగడంతో ఆ దేశం తోకముడిచిందని అన్నారు. అలాగే ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో తల దూర్చి తగిన మూల్యం చెల్లించుకుందని ఎద్దేవా చేశారు. టారిఫ్ వార్, ఇరాన్ వార్‌లో ప్రపంచం ముందు అమెరికా విఫలమైందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక, రాజకీయ విధానాల్లో మార్పులొస్తున్నాయని గుర్తు చేశారు. ఈ పరిణామాలను అందిపుచ్చుకుని ముందుకు సాగితే భవిష్యత్ కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. తెలంగాణ, ఆంధ్రాలో ఒక్క ఎమ్మెల్యే, ఎంపి సీటు లేదని కార్యకర్తలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఓట్లు, సీట్లు మనకు ముఖ్యం కాదని అభిప్రాయ పడ్డారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లను తుడిచేందుకు అలుపెరగని పోరాటం చేస్తున్న ఎర్రజెండాలది చరిత్రలో వెలకట్టలేని స్థానమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుల బలోపేతానికి కొరటాల ఎనలేని కృషి చేశారని అన్నారు. 1968 ప్రాంతంలో నక్సలైట్ల నుంచి ఎదురైన ప్రతిఘటనను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అంబటి కేంద్రాల ఏర్పాటు, భూ పంపిణీ, పత్తి రైతుల ఆత్మహత్యలపై ఆయన అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను చివరి వరకు త్రికరణ శుద్ధితో ఆచరించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. ఆయన ఆశయాలకు మనమందరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన నవ తెలంగాణ సీజీఎం ప్రభాకర్ మాట్లాడుతూ పూర్వ ప్రజాశక్తి అభివృద్ధి కోసం కొరటాల చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పత్రికకు ప్రభుత్వం నుంచి స్థలాలు ఇప్పించడంలో ఆయన విశేషంగా కృషి చేశారని కొనియాడారు. నవతెలంగాణ స్టేట్ బ్యూరో ఛీఫ్ బివిఎన్ పద్మరాజు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పత్రిక సంపాదకులు రాంపల్లి రమేశ్, బుక్‌హౌస్ ఎడిటర్ ఆనందాచారి, నవతెంగాణ సిబ్బంది పాల్గొన్నారు.

పంచనామా నిర్వహిస్తున్న పోలీసులను ఢీకొట్టిన డిసిఎం

- ఎస్ఐ వెంకటేష్‌కు విరిగిన రెండు కాళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలానగర్ ఫ్లైఓవర్‌పై రెండు ప్రమాదాలు జరిగాయి. కారు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందారు. ఆ తర్వాత అక్కడ పంచనామా చేస్తున్న ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకటేష్‌ను డిసిఎం ఢీకొట్టింది. ఈ ఘటనలు మంగళవారం జరిగాయి. సిఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున బాలానగర్ ఫ్లైఓవర్ నుంచి కూకట్‌పల్లి వైపు గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా బోయిన్‌పల్లి వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో పాదచారుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేష్ సమాచారం తెలుసుకొని పంచనామా చేసేందుకు సంఘటనా స్థలానికి వెళ్లారు. ఆ సమయంలో బోయిన్‌పల్లి నుంచి వేగంగా దూసుకొచ్చిన డిసిఎం వాహనం ఎస్ఐ వెంకటేష్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. ఆయనను వెంటనే మాదాపూర్ యశోద ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ డిసిపి సురేష్ కుమార్, ఎసిపి నరేష్ రెడ్డి, సిఐ నరసింహారాజు ఎస్ఐని పరామర్శించారు. కాగా, ప్రొబేషనరీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ జూన్ 30తో ఆరు నెలల శిక్షణాకాలం ముగిసింది. జులైలో పోస్టింగ్ రానున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగింది.

హిమాయత్‌సాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒక గుర్తు తెలియని వ్యక్తి హిమాయత్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్ సాగర్ చెరువులో ఒక మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి బయటకు తీశారు. అతడు నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అతని వద్ద లభించిన ఆధారాల ప్రకారం అతని పేరు ముఖేష్ (34)గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఎవరూ అతన్ని గుర్తించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు.

చార్మినార్ జోన్‌లోనూ త్వరలో ఉద్యోగోన్నతులు

- ఉద్యోగ జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చార్మినార్ జోన్‌లోనూ సీనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహశీల్దార్ వరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుందని రెవెన్యూ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జోన్లలో ఇప్పటికే ఉద్యోగోన్నతులు జరిగాయని తెలిపారు. మంగళ వారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాకలతో కలిసి సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి విన్నవించనట్టు తెలిపారు. కోర్టు కేసు కారణంగా కేవలం చార్మినార్ జోన్‌లోనే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆగిపోయిందని వివరించినట్టు పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారనీ, త్వరలోనే ఉద్యోగోన్నతుల ప్రక్రియను చేపట్టి అర్హులందికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉర్సా క్లస్టర్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఎరిక్ వార్నర్

హైదరాబాద్ : దేశంలోని తొలి ఇంటిగ్రేటెడ్ ఎఐ మౌలిక సదుపాయాల సంస్థ ఉర్సా క్లస్టర్‌లో డేటా సెంటర్‌ల విస్తరణ కోసం ఎన్‌విడియా, ఒరాకిల్, ఆర్‌ఎస్ఎ లాంటి దిగ్గజ కంపెనీలకు చెందిన అనుభవజ్ఞులైన ఎగ్జిక్యూటివ్‌లను తీసుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఎరిక్ వార్నర్ నియమించినట్లు పేర్కొంది. భారత్‌లో ఎఐ మౌలిక సదుపాయాల డిమాండ్‌ను తీర్చేందుకు ఉర్సా క్లస్టర్స్ ప్రత్యేక స్థానంలో ఉందని వార్నర్ తెలిపారు.

స్థిరమైన అభివృద్ధికి రాయబారులుగా విద్యార్థులు

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపు
- స్వయం సంవృద్ధి, ఎగుమతి దేశంగా భారత్
- ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జ్ఞానం, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధికి రాయబారులుగా విద్యార్థులుండాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పు, పంటకోత తర్వాత నష్టాలు, మార్కెట్ అస్థిరత వంటి అత్యంత ముఖ్యమైన ఉద్యానవన సవాళ్లను ఎదుర్కోవడానికి అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, బలమైన భాగస్వామ్యాలు ఉండాలని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. 353 మిలియన్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తితో మన దేశం ప్రపంచ నాయకునిగా నిలుస్తోందన్నారు. పండ్లు, కూరగాయల్లో చైనా తర్వాత రెండవ స్థానంలో మనమున్నామని, అరటి, మామిడి, బొప్పాయి ఉత్పత్తిలో మనం ప్రపంచంలోనే ముందున్నామన్నారు. ఉల్లిపాయలు, అల్లం, బెండకాయల ఉత్పత్తిలోనూ అగ్రస్థానం మనదేనని తెలిపారు. అలాగే తెలంగాణ ఉద్యాన శక్తి కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 12.94 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు 61.64 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఈ రంగం రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తిలో 34శాతం వాటాను కలిగి ఉందన్నారు. ఇది కేవలం వ్యవసాయ విస్తీర్ణంలో ఏడు శాతం మాత్రమేనని తెలిపారు. తెలంగాణ మిరప ఉత్పత్తిలో రెండవ స్థానంలో, పసుపులో మూడవ స్థానంలో ఉందన్నారు. మామిడి పండ్లు భారతదేశం అంతటా, విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు చెప్పారు. ములుగు జిల్లా ఎస్.తడ్వాయి మండలంలో ఉన్న కొండపర్తి అనే గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకున్నట్టు తెలిపారు. రైతులకు సహాయం చేయడానికి విశ్వవిద్యాలయం ఆఫ్ క్యాంపస్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక సహాయాన్ని అందించాలని కోరారు. ఈ గ్రామం కారం, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాల మిశ్రమాలను ఉత్పత్తి చేయగల మసాలా ప్రాసెసింగ్ యంత్రాల సంస్థాపనకు దోహదపడిందన్నారు. పటాన్‌చెరులోని ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. భారతదేశం ఆహార కొరత ఉన్న దేశం నుంచి స్వయం సమృద్ధి, ఎగుమతి దేశంగా ఎదిగిందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం మన దేశం 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని తెలిపారు. 2016-17 నుంచి 2022-23 వరకు వ్యవసాయం ఐదు శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. ఇప్పుడు దేశ స్థూల విలువ జోడింపునకు దాదాపు 20శాతం దోహదపడుతుందని 2024-25 ఆర్థిక సర్వే పేర్కొన్నట్టు చెప్పారు. అనంతరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి రాజి రెడ్డి స్వాగత ప్రసంగం చేసి విశ్వవిద్యాలయం పురోగతి నివేదికను సమర్పించారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

బిఎస్‌సి (ఆనర్స్) హార్టికల్చర్‌లో గుడిసె చైతన్య నాలుగు బంగారు పతకాలు సాధించారు. అలాగే, డాక్టర్ హరిబాబు, విశ్వ శాంతి, డాక్టర్ నగేష్ మర్రి బంగారు పతకాలు సాధించారు. ప్లాంట్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ కోర్సుల్లో కొర్ర రోషిణి ఒజిపిఎ టాపర్‌గా నిలిచినందుకు డాక్టర్ కొమ్మ చంద్రశేఖర్‌రెడ్డి స్మారక బంగారు పతకం లభించింది. ఉద్యాన కోర్సుల్లో ఒపిపిఎ టాపర్‌గా కోతకాపు మౌనికా రెడ్డికి గజ్జల లక్ష్మి, బాలిరెడ్డి బంగారు పతకం లభించింది. బిఎస్‌సి (ఆనర్స్) ఫారెస్ట్రీలో తొగితా రేణుక, సుదర్శి రమ్య బంగారు పతకాలు సాధించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎంఎస్‌సి హార్టికల్చర్)లో అచ్చుత, మోనిక శ్రీ, నాగిని రెండు బంగారు పతకాలు, కూరగాయల శాస్త్రంలో టాపర్‌గా సింధుజాకు బోగ చంద్రయ్య, గంగు బాయి స్మారక బంగారు పతకం, ప్లాంటేషన్, సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటల్లో టాపర్‌గా రంజిత్‌కుమార్‌కు కేసర్ అన్నంవర్ స్మారక బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఫ్రూట్ సైన్స్‌లో టాపర్ దిశకు ఎస్‌కె నోవా ఐకాన్ బంగారు పతకం అందుకుంది. ఈ స్నాతకోత్సవంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్దా జనయ్య, వెటర్నరీ విశ్వవిద్యాలయం విసి డాక్టర్ జ్ఞాన ప్రకాశ్, సిసిఒఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మాథుర్, వర్సిటీ అధికారులు డాక్టర్ ఎ భగవాన్, డాక్టర్ జె చీనా, సురేష్, సీనివాసన్, ప్రశాంత్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే సిగాచి ప్రమాదం

- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచి రసాయన పరిశ్రమ ప్రమాదంలో 45 మందికిపైగా కార్మికులు మరణించడం అత్యంత విషాదకరమని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. యాజమాన్య నిర్లక్ష్యం ఫలితంగానే ఈ ప్రమాదం జరిగిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి మరణాలు కాదని, హత్యలని విమర్శించారు. ఇటీవల రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పదుల సంఖ్యలో కార్మికులు చనిపోతున్నారని పేర్కొన్నారు. ఫార్మాకంపెనీలు, కెమికల్ యాజమాన్యాలు యంత్రాలను, కెమికల్ ట్యాంకులను తరచూ తనిఖీ చేసే బాధ్యతను విస్మరించాయని విమర్శించారు. లాభాల దాహం తప్ప కార్మికుల ప్రాణాలంటే విలువ లేదని తెలిపారు. ఈ ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోషులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరణించిన కార్మికులు, ఉద్యోగులకు రూ.ఐదు కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మరణించిన వారి పిల్లలకు విద్యనందించాలని సూచించారు. తీవ్రంగా గాయపడిన వారి ఒక్కో కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని తెలిపారు. కెమికల్, ఫార్మా సంస్థల అనుమతులపై సమీక్ష జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాలుగున ఎల్‌బి స్టేడియంలో కాంగ్రెస్ కీలక సమావేశం

- ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులతో ఈనెల నాలుగున ఎల్‌బి స్టేడియంలో కీలక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గ్రామ శాఖ అధ్యక్షులతో నేరుగా మాట్లాడుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ చరిత్రలో గొప్పగా నిలిచిపోతుందని ఆయ అభిప్రాయపడ్డారు. ఆ సమావేశంలో ఖర్గే ఇచ్చే సందేశాన్ని రాష్ట్ర ప్రజలకు చేరవేయాలని గ్రామ శాఖ అధ్యక్షులకు సూచించారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకత్వం కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన జై సంవిధానం కార్యక్రమం మన రాష్ట్రంలో విజయవంతంగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

వైద్యుల సేవలు అమూల్యమైనవి : మహేశ్‌కుమార్‌గౌడ్

రోగులకు వైద్యులు చేస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రతి ప్రాణానికి వైద్యులు అండగా నిలిచే ప్రాణదాతలు అని పేర్కొన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, సేవా దృక్పథంలో రోగులకు నిస్వార్థ సేలందిస్తున్నారని గుర్తు చేశారు. డాక్టర్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్లకు 15 శాతం స్టైఫండ్ పెంచడంతోపాటు సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల గౌరవ వేతనాన్ని పెంచిందని ఆయన గుర్తు చేశారు.

ఫార్మా కంపెనీలో పేలిన బాయిలర్

- కార్మికుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెను విషాదాన్ని మిగిల్చిన పాశమైలారం సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాదంలో సహాయక చర్యలు కొనసాగుతుండగానే.. మరో ఫార్మా కంపెనీలో బాయిలర్ పేలింది. మేడ్చల్ పారిశ్రామికవాడలో ఓ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించింది కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్కలైడ్ ఫార్మా కంపెనీలో మంగళవారం ఉదయం పది గంటల సమయంలో బాయిలర్ ఒక్కసారిగా పేలింది. ఆపరేటర్ గాన్నారం శ్రీనివాస్ రెడ్డి (45) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు, కంపెనీ సిబ్బంది మేడ్చల్‌లోని మెడినోవా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఎఐజి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. బాయిలర్ ఆపరేటర్ శ్రీనివాస్‌రెడ్డి 15 ఏళ్లుగా ఆల్కలైడ్ కంపెనీలో పనిచేస్తున్నట్టు తెలిపారు. కంపెనీ యాజమాన్యం సరైన భద్రతా నియమాలు పాటించకపోవడంతో ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. కంపెనీకి కనీసం ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవని తెలిపారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని వాపోయారు. బాధితుడికి కంపెనీ యజమాన్యం మెరుగైన చికిత్స అందించి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ఎసిపి శంకర్ రెడ్డి, సిఐ అద్దాని సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ పరిశీలించారు.

భోజనంలో పురుగు

టియులో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తెలంగాణ యూనివర్సిటీలోని పిజి న్యూ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. సోమవారం రాత్రి భోజనంలో పురుగు రావడంతో అధికారుల పర్యవేక్షణ లోపాన్ని నిరసిస్తూ మంగళవారం యూనివర్సిటీలోని హాస్టల్ వద్ద ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న చీఫ్ వార్డెన్ విద్యార్థుల వద్దకొచ్చి మాట్లాడారు. విద్యార్థులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రావాల్సిందేనని భీష్మించుకూర్చున్నారు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నా పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరి అక్కడికి చేరుకుని వసతి గృహంలోని కిచెన్‌లో కలియతిరిగి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి హామీనిచ్చారు. వైస్ ఛాన్సలర్ అందుబాటులో లేని కారణంగా ఆయన దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులంతా కలిసి రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

ఎల్‌ఐసిని బలోపేతం చేసుకుందాం

- ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకుందాం
- లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకోవాల్సిందే : శ్రీకాంత్ మిశ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

సంస్థ ప్రగతితోనే ఉద్యోగుల భవిష్యత్తు అన్న దాన్ని గుర్తించి ఎల్‌ఐసి బలోపేతం కోసం అందులోని ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకునే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల హక్కుల కోసం విశాల ఐక్యవేదికగా పోరాటాలు నిర్వహించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో హైదరాబాద్-సికింద్రాబాద్ డివిజన్ల ఆధ్వర్యంలో ఎఐఐఇఎ ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ..ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దు చేసి ఇన్సూరెన్స్ సంస్థలను ఒకే సంస్థగా జాతీయకరించాలనే విషయంలో ఎఐఐఇఎ విజయవంతమైందన్నారు.

ఎల్‌ఐసి ప్రభుత్వ రంగ సంస్థగా 1956 సెప్టెంబర్ ఒకటిన ఆవిర్భవించేలా చేయడంలో ఎఐఐఇఎ పాత్రను గుర్తుచేశారు. చంద్రశేఖర్ బోస్, సరోజ్ చౌధరి, సునీల్ మైత్ర, ఎన్ఎం సుందరం, ఆర్‌పి మన్‌చంద వంటి నేతల త్యాగాలను స్మరించుకున్నారు. ఆ తర్వాత అమానుల్లా ఖాన్, కె వేణుగోపాల్ దార్శనికతతో ఒక కట్టుదిట్టమైన సంఘంగా నేటికీ అందరి మన్ననలను అందుకుంటోందని చెప్పారు. యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఎఐఐఇఎ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న, సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న వేళ ఎల్‌ఐసి ప్రతి ఉద్యోగి కూడా నాలుగు అంశాలపై దృష్టి పెట్టి పనిచేయాలని కోరారు. ఒకవైపు ఎల్‌ఐసీ సంస్థను బలోపేతం చేసుకుంటూనే మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్‌ఐసిని ప్రభుత్వరంగంలో కొనసాగించేందుకు నిరంతర పోరాటాలు చేయాలన్నారు. లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న మోడీ సర్కారు కుట్రలను తిప్పికొట్టేందుకు విశాల ఐక్యవేదిక ద్వారా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ చేసినవారు యూనియన్లకు ప్రాతినిధ్యం వహించకూడదనేది దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎఐఐఇఎ నాయకులు వి రమేశ్, రవీంద్రనాథ్, జి తిరుపతయ్య, గిరిధర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరిట మోసం... నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిట్టీల పేరిట మోసం చేసిన నలుగురిని అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ టూ టౌన్ సిఐ సోమనరసయ్య తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సైదిరెడ్డి, కటికం వెంకటరెడ్డి, ముద్దిరెడ్డికొండకు చెందిన మామిళ్ల వెంకన్న, రామ్‌నగర్‌కు చెందిన గుణగంటి జానయ్య కొంతకాలంగా చిట్టీలు నడుపుతున్నారు. పలువురు నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారు. వడ్డీ అధికంగా ఇస్తామని ఆశ చూపి 42 మంది నుంచి సుమారు 1.50 కోట్లు వసూలు చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు అడిగితే బెదిరింపులకు పాల్పడ్డారు. దాంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద 46 చిట్టీల పుస్తకాలు, 50 ప్రాంసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పర్చనున్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు రాంబాబు, హరీష్ రెడ్డి ఉన్నారు.



నగరంలో ఐషర్ కొత్త డీలర్‌షిప్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ : విఇ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ (విఇసివి) వ్యాపార విభాగం అయిన ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ కొత్తగా ప్రారంభించిన ఐషర్ ప్రో ఎక్స్ చిన్న ట్రక్కుల కోసం ప్రత్యేకమైన డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. నగరంలోని గండిమైసమ్మలో ఉన్న కొత్త ఎంజిబి మోటార్ అండ్ ఆటో ఏజెన్సీస్‌తో కలిసి దీన్ని ఏర్పాటు చేసినట్లు విఇసివి నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ ఇవిపి రమేష్ రాజగోపాలన్ తెలిపారు.